క్లుప్తంగా

ఉత్తమ వీపీఓగా వెంకటేశ్వర్లు



అవార్డు అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కట్టంగూర్ : కట్టంగూర్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ బోడ వెంకటేశ్వర్లు బొల్లేపల్లి గ్రామ పోలీసు అధికారిగా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా గురువారం ఆయన జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయిలోఉత్తమ గ్రామ పోలీసు అధికారి(వీపీఓ)గా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వెంకటేశ్వర్లుకు నగదుతో పాటు అవార్డు అందజేశారు. వెంకటేశ్వర్లును ఎస్ఐ మునుగోటి రవీందర్, సిబ్బంది అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ క్యాంపు కార్యాలయంలో 37 మందికి మంజూరైన రూ.14,66,500 విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

కనగల్ : మండల కేంద్రంలోని అగ్రోస్, పర్వతగిరి ఎన్‌డీసీఎంఎస్‌లో రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి బెజవాడ అమరేందర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ భూమి పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు జీరాక్స్ ప్రతులను తీసుకుని కనగల్ రైతువేదిక వద్ద ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. 30 కేజీల బస్తా రూ.2138 ఉందన్నారు. చర్లగౌరారం, చెట్లచెన్నారం, పగిడిమర్రి క్లస్టర్ రైతులు పర్వతగిరి ఎన్‌డీసీఎంఎస్ వద్ద కనగల్, జి యడవల్లి క్లస్టర్ రైతులు కనగల్ అగ్రోస్ వద్ద విత్తనాలను తీసుకోవాలన్నారు.

ఉగ్రవాదులను అంతం చేయాలి



జెండా ఆవిష్కరిస్తున్న ఆదిరెడ్డి

కనగల్ : పాకిస్తాన్ ఉగ్రవాదులను అంతం చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు మల్లెపల్లి ఆదిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సీపీఐ మండల 15వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగరవేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్, పల్లా దేవేందర్‌రెడ్డి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, దోటి పాండరి, జినుకుంట్ల సోమయ్య, జోగు సురేందర్, చిలకరాజు రాములు, జోగు నాగమ్మ, జినుకుంట్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్‌లు సక్రమంగా పంపిణీ చేయండి



మాట్లాడుతున్న సెర్ప్ డైరెక్టర్ శ్రీనివాసరావు

కట్టంగూర్ : అర్హులైన లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ డబ్బులను సక్రమంగా పంపిణీ చేయాలని సెర్ప్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని కురుమర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆసరా పెన్షన్ పంపిణీని పరిశీలించి మాట్లాడారు. పెన్షన్ దారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా డబ్బులు పూర్తిగా చెల్లించాలని సూచించారు. ఆయన వెంట డీటీఎం దామోదర్‌రెడ్డి, డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి, ఎంపీఓ చలపతి, ఏపీఎం సైదులు, కార్యదర్శి శ్రావణ్, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వన్ టౌన్ విద్యుత్ శాఖ ఏడీ వేణుగోపాల్ తెలిపారు. నల్లగొండ పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్, సతీష్ నగర్, డాక్టర్స్ కాలనీ, అన్సారీ కాలనీ, బస్టాండ్ ఎదురుగా, దారుష్ఫా కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నామని పేర్కొన్నారు.

'ఇంటిగ్రేటెడ్' పూర్తయ్యేది ఎప్పుడో !

- 18 నెలలుగా కనిపించని పురోగతి
- బిల్లులు రాకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- మరో సంస్థకు పనులు అప్పగించిన మున్సిపల్ అధికారులు

నకిరేకల్ : పట్టణంలో వెజ్, నాన్ వెజ్ విక్రయాలు ఒకేచోట ఉండాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. 2021 జూన్ 15వ తేదీన గత ప్రభుత్వం రూ.6.30 కోట్లతో సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పనులు ప్రారంభించి దాదాపు నాలుగేళ్లు కావొస్తున్నా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు 18 నెలల క్రితమే నిలిచిపోయాయి. దీంతో ఈ మార్కెట్ ఎప్పటికి పూర్తయ్యేనో అనే సందేహం అటు ప్రజల్లో, ఇటు చిరు వ్యాపారుల్లో నెలకొంది. సుమారు 40 వేల పైచిలుకు జనాభా కలిగి ఉన్న నకిరేకల్ పట్టణంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ అవసరాల కోసం నిత్యం వస్తూ ఉంటారు. రోడ్లపైనే కూరగాయల వ్యాపారంపాటు, మాసం, చేపల విక్రయాలు కూడా సాగుతున్నాయి. ఈ మార్కెట్‌లో మొత్తం మూడు బ్లాక్‌లు నిర్మించాల్సి ఉంది. గత అగ్రిమెంట్ ప్రకారం 48 షాపులు నిర్మించాల్సి ఉండగా తాజాగా మారిన అగ్రిమెంట్ ప్రకారం 68 షాపులకు పెరిగాయి. ఇప్పటివరకు రెండు బ్లాక్‌లు మాత్రమే కేవలం స్లాబ్ లెవల్ వరకు నిర్మించి వదిలేశారు.

నిధులు రాకపోవడంతో..

నకిరేకల్ సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజురు చేసింది. రెండో విడతలో మరో రూ.4.30 కోట్లు మంజూరయ్యాయి. 2021 జూన్‌లో ఓ కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకుని పనులు మొదలుపెట్టారు. అయితే గత ప్రభుత్వం తొలి విడతలో మంజూరు చేసిన నిధులు విడుదల చేయకపోవడంతో రెండు బ్లాక్‌ల వరకు నిర్మించి వదిలేశారు. సదరు అగ్రిమెంట్ అయిన కాంట్రాక్టర్‌కు ఒక్క పైసా కూడా చేసిన పనులకు నిధులు రాకపోవడంతో పనులు చేయలేనని చేతులెత్తేశారు. దీంతో మున్సిపల్ అధికారులు 60/సీ జీఓ ప్రకారం నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణ సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేస్తున్న ఎస్‌కేఆర్ సంస్థకు అప్పగించారు.



నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు



రోడ్డుపైనే చేపల విక్రయాలు



రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

నకిరేకల్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయి దాదాపు 18 నెలలు కావొస్తోంది. మొదటి విడతగా కాంట్రాక్ట్ దక్కించుకున్న వారికి రూ.80 లక్షల బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపాం. అవి ఇంకా విడుదల కాలేదు. మొదట అగ్రిమెంట్ చేసుకున్న కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల కాకపోవడంతో పనులు పూర్తి చేయలేనని చేతులెత్తేశాడు. దీంతో నకిరేకల్‌లోనే మున్సిపల్ పనులు చేస్తున్న ఎస్‌కేఆర్ సంస్థకు అప్పగించాం. అగ్రిమెంట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పనులు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.



–గౌతం, ఏఈ, నకిరేకల్ మున్సిపాలిటీ

దశలవారీగా అభివృద్ధి చేస్తున్నాం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : పట్టణాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని 1,6, 4, 15, 12, 18 వార్డుల్లో ఎస్‌డీఎఫ్ నుంచి రూ.70 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అన్ని వార్డుల్లో దశలవారీగా సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టి అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, డీఈ కొండయ్య, ఏఈ సంపత్, ఆయా వార్డుల కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, గాజుల సుకన్యశ్రీనివాస్, మట్టిపల్లి కవితా వీరు, యాసారపు లక్ష్మీ వెంకన్న, బానోతు వెంకన్న, రాచకొండ సునీల్, గర్శకోటి సైదులు, గడ్డం స్వామి, చౌగోని రాములమ్మ, పోతుల సునీత రవీందర్, పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, చౌగోని అఖిల, వంటిపాక సోమలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నిరుపేద ప్రజలకు అండగా ఉంటాం



నగదు అందజేస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: ఆపదలో ఉన్న నిరుపేద ప్రజలకు ఎలవేళలా అండగా ఉంటామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్ అన్నారు. మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మిదేవిగూడెంకు చెందిన యంపల్ల నరేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం నరేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చెరో రూ.20వేల చొప్పున అందించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచన మేరకు నరేష్ భార్యకు మునుగోడు ప్రాథమిక సహకార బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులకు విద్యాపరంగా అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, ఓబీసీ జిల్లా కార్యదర్శి బూడిద లింగయ్యయాదవ్, మాజీ సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, తాటికొండ సైదులు యాదవ్, మాజీ ఎంపీటీసీ పందుల భాస్కర్, ఎండీ రఫీక్, నాయకులు ముచ్చపోతుల శ్రీనివాసులు, జంగిలి నాగరాజు, బీసం విజయ్, సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల వీరేశం



ఆర్‌టీసీ బస్ టికెట్‌లను చూపుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చిట్యాల: పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో యాభై ఐదు మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు గురువారం ఆయన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వెలిమినేడులో నైట్‌హాల్ట్ ఆర్‌టీసీ బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు తప్పిదాలకు పాల్పడవద్దని సూచించారు. వెలిమినేడు గ్రామస్తుల సౌకర్యార్థం హయత్‌నగర్ ఆర్‌టీసీ డిపోకు చెందిన నైట్‌హాల్ట్ బస్సు సర్వీస్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. వెలిమినేడులో ఆర్‌టీసీ బస్సు సర్వీస్‌ను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే..టికెట్‌లు తీసుకుని కొద్ది దూరం ప్రయాణించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కృష్ణనాయక్, ఎంపీడీఓ జయలక్ష్మీ, ఏఎంసీ చైర్మన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, కాటం వెంకటేశం, జడల చినమల్లయ్య, మాజీ సర్పంచ్ బుర్రి రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సాగర్ల నరేష్, బట్టు అయిలేష్, కొంపెల్లి వెంకట్‌రెడ్డి, సుర్కంటి సత్తిరెడ్డి, గణేశ్, శ్రీశైలం, నాగరాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: టీయూడబ్ల్యూజే(హెచ్–143) కార్యవర్గాన్ని గురువారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కారంపూరి మధు(హెచ్‌ఎం టీవీ), ప్రధానకార్యదర్శి వాస రాంమోహన్(వార్త) ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బొడిగె విజయ్‌కుమార్(వార్త), కోశాధికారిగా చెన్నోజు చంద్రశేఖర్(ప్రజాజ్యోతి), కార్యనిర్వాహక కార్యదర్శిగా గుండ్లపల్లి వెంకన్న(ప్రజాదర్బార్), కార్యదర్శులుగా అంతటి శ్రీను(టీవీ9), బండ నవీన్(సాక్షి టీవీ), సహాయ కార్యదర్శిగా కంచుకొమ్ముల అనిల్(ఏఎస్ఎన్ టీవీ), సాంస్కృతిక కార్యదర్శిగా మూడ వెంకటాద్రి(ఉదయం)లతోపాటు మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైట్లు పేర్కొన్నారు.

మరుగుదొడ్లకు తాళం



చిట్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు

చిట్యాల: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోని మరుగుదొడ్లు గత పదిరోజులుగా మూసి ఉన్నాయి. దీంతో బస్‌స్టేషన్‌లోకి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెప్టిక్ ట్యాంకులు నిండిపోవటంతో మరుగుదొడ్లను మూసి వేసినట్లు తెలుస్తోంది. వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కట్టంగూర్ : ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఈ నెల 20న జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల నాయకులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ పొటిచేటి సులోచన, గుడుగుంట్ల రామకృష్ణ, పొడిచేటి లింగయ్య, సలీం, అక్బర్, లక్ష్మీనారాయణ, శ్రీను, కృష్ణ, ముసుకు రవీందర్, ఆశా వర్కర్‌లు చెరుకు జానకి, అంతటి సంతోష, పద్మావతి, సునిత, సంధ్య పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, లేబర్‌కోడ్‌ల రద్దు కోసం ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్, ఎల్ఐసీ కార్యాలయం, సంక్షేమ భవన్‌లో ఉద్యోగులకు కరపత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పరిపూర్ణాచారి, మల్లం మహేష్, నలపరాజు సైదులు, కొప్పు వెంకన్న, గడ్డం నవీన్, లింగయ్య, వేములు శ్రీనివాస్, దేవేందర్, శివశంకర్, వెంకన్న, పృథ్వీరాజ్, రామలింగం పాల్గొన్నారు.



నల్లగొండ టౌన్ : కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కనగల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేఖ విధానాలపై ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం రైతాంగం సిద్ధం కావాలని సీఐటీయూ మండల కన్వీనర్ కానుగు లింగస్వామి అన్నారు. సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పిన్నపురెడ్డి శేఖర్‌రెడ్డి, బచ్చగోని పెద్దులు, లింగయ్య, భిక్షం, బుచ్చయ్య, యాదయ్య, కేశవులు, రవి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ తయారీతో అదనపు ఆదాయం

మర్రిగూడ : తడి, పొడి చెత్త సేకరణతో తయారు చేసే వర్మీ కంపోస్ట్‌తో గ్రామపంచాయతీకి అదనపు ఆదాయంతోపాటు ఉపయోగాలు ఉంటాయని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సెగ్రిగేషన్ షెడ్‌లో వర్మీ కంపోస్ట్ తయారీపై నాంపల్లి, మర్రిగూడ, చింతపల్లి మండలాల అధికారులకు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని చెత్తతో ఉపయోగాలు, వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చినమునయ్య, మర్రిగూడ, నాంపల్లి ఎంపీఓలు బి.రవికుమార్, ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీపీఓ వెంకయ్య

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేడుకల్లో నకిరేకల్ సబ్ ఇన్‌స్పెక్టర్ గడగోజు కృష్ణామాచారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు కృష్ణామాచారి, ఆలయ కమిటీ చైర్మన్ చొల్లేటి బ్రహ్మచారి–సుభద్ర, గడగోజు కనకాచారి–రమాదేవి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పెందోట సోమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు ఉత్తరపెల్లి అనంతాచార్యులు, బేతోజు సత్యనారాయణశాస్త్రి, బుగోజు రామలింగాచారి, గుంటోజు , పెందోట భిక్షమాచారి, కంచర్ల జానాచారి, వాసు, ఉమా తదితరులున్నారు.



స్వామివారిని ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గట్టుప్పల్ : మండలంలోని అంతంపేట గ్రామంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు అందజేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, నలపరాజు రామలింగయ్య గురువారం చండూరు ఆర్‌డీఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నిరుపేదలకు సర్వే నంబర్ 6/ఉ లో భూమి కేటాయించారని, ఆ స్థలాలను పేదలకు అందించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, గట్టుప్పల్ సీపీఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, అయితరాజు లక్ష్మయ్య, గూడెం నరసింహ, పెంటయ్య, తెలుసూరి సైదులు, మాదగోని కోటమ్మ, సత్తమ్మ నరసింహ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే రైతులకు ఎరువులు విక్రయించాలి

గట్టుప్పల్ : రైతులకు విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా దుకాణాలను సీజ్ చేస్తామని ఏడీఓ వేణుగోపాల్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఎరువులు, విత్తణాల దుకాణాల యాజమానులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తనాలు, ఎరువుల అమ్మకపు వివరాలను రికార్డుల్లో ప్రతిరోజు పొందుపరచాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన మందులకు, విత్తనాలకు తప్పనిసరి రశీదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు కార్తీక్, రాకేష్ , డీలర్లు ఐలయ్య, దాసరి రమేష్, వెంకన్న, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఓ వేణుగోపాల్

వాహనదారులకు ఊరట



ట్యాంకర్‌తో నీటిని చల్లిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

నల్లగొండలోని సుభాష్ విగ్రహం నుంచి గొల్లగూడ వెళ్లే రోడ్డులో రహదారి నిర్మాణం చేపడుతున్నారు. కంకరపరచి దారిపై నీళ్లు చల్లకపోవడంతో వాహనాలు వెళ్లే సమయంలో విపరీతంగా దుమ్ము లేచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఈ నెల 14న సాక్షి దినపత్రికలో 'దుమ్ముతో నిత్యం నరకం' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రహదారిపై ట్యాంకర్లతో నీటిని చల్లిస్తున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు



తిప్పర్తి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు



లారీలోకి ధాన్యం లోడ్ చేస్తున్న హమాలీలు

- లారీల కొరతతో కొంత ఆలస్యం
- మిల్లర్లతో నేరుగా మాట్లాడి ఎగుమతులు చేయిస్తున్న అధికారులు

తిప్పర్తి : యాసంగి సీజన్‌లో తిప్పర్తి మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు వచ్చాయి. మండలంలో ప్రభుత్వం 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 9 ఐకేపీ కేంద్రాలు, 9 పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు లక్ష 70వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా సుమారు పదివేల క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంది. 9 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు లక్షా 38 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. ఇంకా సుమారు 20 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం నిల్వ ఉంది.

సక్రమంగా రాని లారీలు..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత, గన్నీ బ్యాగుల సమస్యలతో కొనుగోళ్లు ఆలస్యంగా జరిగాయి. ఇంకా లారీల కొరత తీవ్రంగా ఉంది. మిగిలిన ధాన్యం ఎగుమతి కూడా వేగవంతం కావడానికి లారీలు సక్రమంగా రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. తిప్పర్తి తహసీల్దార్ పరుశురాం మిల్లుల వద్దకు వెళ్లి మిల్లర్లతో మాట్లాడి ధాన్యం దిగుమతి చేయిస్తున్నారు. అయినప్పటికీ దిగుమతులు ఆలస్యం అవుతున్నాయి,

కేంద్రాలు ఇలా..

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మర్రిగూడెం, సర్వారం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ముగిశాయి. ఒక లారీ చొప్పున వస్తే ఎల్లమ్మగూడెం కేంద్రం ముగుస్తుంది. రెండు లారీలు వస్తే ఇండ్లూరు కేంద్రం ముగుస్తుంది. ఐకేపీ ఆధ్వర్యంలో నాలుగు కొనుగోలు కేంద్రాలు ముగిశాయి. అంతయ్యగూడెం, తానేదార్‌పల్లి, రామలింగాలగూడెం, జంగారెడ్డిగూడెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ముగిశాయి. మిగతా కేంద్రాలకు కూడా ఒక్కో లారీ వస్తే ధాన్యం కొనుగోళ్లు, ఎగుమతులు పూర్తవుతాయి.

> **లారీల కొరతతో ఆలస్యం అవుతోంది**
>
> తిప్పర్తి మండలంలోని 18 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాం. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశలో ఉన్నాయి. మిగిలిన ధాన్యం కూడా త్వరగా ఎగుమతి చేస్తాం. లారీల కొరతతో ఎగుమతులు ఆలస్యం అవుతున్నాయి. మిలర్ల వద్ద కూడా లారీలు దిగుమతి కావడం లేదు. మిల్లర్లతో నేరుగా మాట్లాడి ధాన్యం దిగుమతి చేయిస్తున్నాం.
>
> –పరుశురాం, తిప్పర్తి తహసీల్దార్

ఆదమరిస్తే అంతే సంగతులు !

కట్టంగూర్ : మండల కేంద్రంలోని 2వ వార్డులో సాందీపని పాఠశాల సమీపంలో డ్రెయినేజీపై వేసిన సిమెంట్ పైకప్పు ధ్వంసమైంది. ఇనుప చువ్వలు తేలి రంధ్రం పడడంతో ప్రజలు, మూగజీవాలు ప్రమాదాలబారిన పడుతున్నారు. డ్రెయినేజీపై కప్పు ధ్వంసమై నెలరోజులు గడుస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే వీధి కావడంతో ప్రజలు, వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ దారి గుండా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా డ్రెయినేజీలో చెత్తాచెదారం నెలరోజులుగా తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రెయినేజీకి మరమ్మతులు చేపట్టి, పూడిక తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజీ